విశాలాంధ్ర
గుంటూరు జిల్లా

'ఉక్కు' నిర్ణయం వెనక్కి తీసుకునే వరకూ పోరు

ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి

విశాలాంధ్ర-గుంటూరు: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకునేవరకు ఉద్యమిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమం 700 రోజులైన సందర్భంగా విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి పిలుపు మేరకు గుంటూరు నగరంలో వివిధ కార్మిక సంఘాలు, విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంఘీభావ ప్రదర్శన శనివారం జరిగింది. ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, సీఐటీయూ నగర పశ్చిమ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వీ కృష్ణ, నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, ఎల్‌ఐసీ యూనియన్ నాయకులు వీవీకే సురేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే వలి, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సుధీర్‌లు ప్రసంగించారు. గత 700 రోజులుగా కార్మికవర్గం, ప్రజానీకం పెద్దఎత్తున ఉద్యమిస్తున్న కారణంగా కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని, పరిశ్రమ నిర్వీర్యానికి కుట్ర పన్నుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పదే పదే పార్లమెంట్‌లో విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తామని చెప్తుందని, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు రాష్ట్ర వ్యాపితంగా ఉద్యమిస్తామని, భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసింది మినహా ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏమీ మాట్లాడకుండా మోదికి సాగిలపడిందని అన్నారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు కేంద్ర నిర్ణయానికి వ్యతిరేకంగా పల్లెత్తు మాట కూడా మాట్లాడటం లేదని విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేంత వరకు కార్మికవర్గం, ప్రజలు ఐక్యంగా ఉద్యమిస్తామని అన్నారు. అనంతరం శంకర్‌విలాస్ సెంటర్ నుంచి లాడ్జిసెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేడా హనుమంతరావు, నాయకులు బుజ్జి, సీఐటీయూ నగర తూర్పు ప్రధాన కార్యదర్శి కట్లగుంట శ్రీనివాసరావు, నాయకులు ఆది నికల్సన్, షేక్ మస్తాన్‌వలి, షేక్ ఖాశీంవలి, మెడికల్ రిప్రజెంటెటీవ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ కుమార్, జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్ సలీమ్, అధ్యక్షులు ఫణీంద్ర, నాయకులు సుబ్బారావు, హనుమంతరావు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ చిష్టి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, ఎస్ఎఫ్ఐ నాయకులు జిబ్రా అఖిల్, సమీర్, బాలా, చందు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయించండి: సీపీఐ

విశాలాంధ్ర-గుంటూరు: స్థానిక కాకుమానువారితోటలో గల కార్మిక శాఖ స్థలంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయించాలని సీపీఐ నాయకులు శనివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తఫాను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ కాకుమానువారితోటలో కార్మిక శాఖ స్థలం మొత్తం 15 ఎకరాలకు గాను ఆరు ఎకరాల స్థలంలో ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు సీపీఐ పోరాటం ద్వారా గత ప్రభుత్వం కేటాయించిందని గుర్తుచేశారు. ఇప్పటివరకు దానికి సంబంధించి ఎటువంటి పనులు నిర్వహించడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళారు. ఆ స్థలంలో మట్టికుప్పలు ఏర్పడి ఆ ప్రాంతంలోని నివాసాల వద్ద పాములు, విషపూరిత పురుగులు సంచరిస్తుండటంతో స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. అదేవిధంగా పేరుకుపోతున్న వ్యర్థాలతో అక్కడి ప్రజలు తీవ్ర అనారోగ్యపాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి అక్కడ హాస్పటల్ నిర్మాణం వెంటనే చేపట్టాలని, అలాగే మిగిలి ఉన్న స్థలంలో మట్టి కుప్పలను సరిచేసి ఆ స్థలాన్ని పరిశుభ్రం చేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ముస్తఫా మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సోమవారం నుంచి కార్మిక శాఖ స్థలాన్ని పరిశుభ్రం చేసి వాకింగ్ ఏర్పాటు చేయుటకు తగు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారని మాల్యాద్రి తెలిపారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, శశి, 51వ డివిజన్ శాఖ కార్యదర్శి ఎస్‌కే వలి, నగర సమితి సభ్యులు నాసర్ జీ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కమ్మ హాస్టల్ శతాబ్ది ఉత్సవాలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక అరండల్‌పేటలోని కమ్మ బాలుర హాస్టల్ నందు కమ్మ హాస్టల్ శతాబ్ది ఉత్సవాలను ఏప్రిల్ 2వ తేదీ ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్ తెలిపారు. హాస్టల్ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 5 గంటలకు పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుగునని, సాయంత్రం 6 గంటలకు 100వ వార్షికోత్సవ సభా కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ రాజ్యసభ సభ్యులు వై.సుజనా చౌదరి హాజరుకానున్నట్లు తెలిపారు. గుంటూరు పరిసర గ్రామాల నుండి ఉన్నత చదువుల కోసం వచ్చు విద్యార్థులకు బస, విద్యను సులభతరం చేయుటకు 1923వ సంవత్సరంలో శాఖమూరి లక్ష్మి దేవమ్మ, చిరుమామిళ్ళ లక్ష్మీనారాయణ ప్రసాద్, జంపాల సాంబయ్య, జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి, పాటిబండ్ల సీతారామయ్య, డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య వంటి దాతల సహకారంతో హాస్టలను స్థాపించడం జరిగిందన్నారు. దాతల సహకారంతో వేలాది మంది విద్యార్థులు విద్యను ఆర్జించి ఉన్నత స్థానాలలో ఉన్నారన్నారు. ఈ హాస్టల్‌ను స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సామాజిక స్పృహను పెంచు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్వవిద్యార్థులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మందలపు బాగారుబాబు, నాగసుశీల, బి.శ్రీనివాసరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల పుస్తకం ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న ఉచిత, నగదు రహిత వైద్య సేవల వివరాలతో రూపొందించిన పుస్తకాన్ని కలక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజకుమారితో కలసి ఆవిష్కరించారు. డీఆర్‌ఓ చంద్ర శేఖర రావు, డియం అండ్ హెచ్‌ఓ డా.శ్రావణ్ బాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.ఎన్.ప్రభావతి, అధికారులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష సభ్యులపై దాడులు అప్రజాస్వామ్యం

విశాలాంధ్ర-తెనాలి: ప్రజాసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసే ప్రతిపక్ష సభ్యులపై ప్రశ్నించే గొంతులను భౌతికదాడులు చేయడం అప్రజాస్వామ్యమని, వందేళ్ళ పైన చరిత్ర కలిగిన తెనాలి పురపాలక సంఘానికి మాయని మచ్చని, 20 వార్డు కౌన్సిలర్ (టిడిపి) దేసు యుగంధర్‌పై వైసిపి పక్ష కౌన్సిలర్లు దాడిచేయడాన్ని సీపీఐ ఖండిస్తుంది. ఆర్యవైశ్యులు ఇచ్చిన తెనాలి పట్టణ బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తూ శనివారం సిపిఐ బంద్‌లో పాల్గొనడం జరిగింది. ఇలాంటి ఘటనలు పురనావృతం కాకుండా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్ చేస్తుంది. శనివారం జరిగిన బంద్‌లో సిపిఐ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, ఏఐవైయఫ్ నియోజకవర్గ కార్యదర్శి పల్నాటి నాగరాజు, కొల్లిపర మండల సిపిఐ కార్యదర్శి తుంగా బాలస్వామి, సిపిఐ నాయకులు డాక్టర్ కొత్త శశికిరణ్, పరుచూరి వెంకటేశ్వరరావు, ఏఐవైయఫ్ నాయకులు, ఏఐయస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ, టీడీపీ పోటాపోటీ ధర్నా

విశాలాంధ్ర-తెనాలి: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో శుక్రవారం నాడు టిడిపి కౌన్సిలర్ యుగంధర్‌పై జరిగిన దాడికి నిరసనగా శనివారం టిడిపి నాయకులు, ఆర్యవైశ్య సంఘాల వారు బంద్ చేసేందుకు ర్యాలీగా వెడుతుండగా ర్యాలీకి అనుమతులు లేవని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నిరసన ర్యాలీలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. టిడిపి శ్రేణులు, పోలీసులకు మధ్య తోపులాటలు కూడా జరిగాయి. భారీగా పోలీసులు మోహరించారు. పోలీసులకు టిడిపి వర్గాలకు మధ్య వాగ్వివాదం జరిగింది. తాము సూచించిన దారిలోనే ర్యాలీ వెళ్ళాలని పోలీసులు ఆదేశించారు. ఇరువురి మధ్య తీవ్రంగా వాగ్వివాదం జరిగింది. మార్కెట్‌లోకి వెళ్ళకూడదని పోలీసులు ఆంక్షలు విధించారు. మార్కెట్‌లోకి వెళ్ళకుండా అడ్డుకోవడంతో వేరేవైపు ర్యాలీని మళ్ళించారు. పోలీసుల వైఖరికి నిరసనగా టిడిపి శ్రేణులు నినాదాలు చేశారు. టిడిపి శ్రేణులు రోడ్డుపైన బైఠాయించారు. పోలీసులు, స్పెషల్ ఫోర్స్ అక్కడికి చేరుకుని ఏకంగా అరెస్టులు చేశారు. టిడిపి శ్రేణుల అరెస్టులపై ఆ పార్టీ నాయకుల నుండి తీవ్ర నిరసన వ్యక్తమైంది. తీవ్రంగా పోలీసులను ప్రతిఘటించారు. పసుపులేటి త్రిమూర్తి, మహ్మద్ ఖుద్దూస్, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి దూండీ రాకేష్‌లను కూడా బలవంతంగా పోలీసులు బస్ ఎక్కించారు. ఇదిలా వుంటే ఆర్యవైశ్య ప్రముఖులు, మాజీ ప్రముఖులు పెండ్యాల వెంకట్రావు, మద్ది మల్లిఖార్జునరావులు తమ ఆర్యవైశ్య సామాజిక వర్గంపై దాడులకు నిరసనగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని ప్రకటించారు. పోలీసులు వారి దీక్షను భగ్నం చేసి అరెస్ట్ చేసి కొల్లిపర స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో వ్యక్తిగత పూచీకత్తుపై వారిని పంపించివేశారు. పోలీసుల అరెస్టుల నిరసనలు తెలుసుకున్న మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ వారిని పరామర్శించారు. టిడిపి కులరాజకీయాలు చేస్తుందని, టిడిపి కౌన్సిలర్లే తమపై దాడిచేశారని వైసిపి శ్రేణులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కావాలనే తెలుగుదేశం పార్టీ వారు తమపై ఆరోపణలు చేస్తున్నారని, కౌన్సిల్ హాలుతో తమ కౌన్సిలర్లపై టిడిపి వర్గాల వారే దాడి చేశారని, ఇది సహించరాని విషయమని వైసిపి వర్గాల వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైసిపి శ్రేణులు కూడా ర్యాలీ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

ల్యుమినస్ నుంచి ఐకాన్, హైకెపాసిటీ ఇన్వెర్టర్ శ్రేణి

గుంటూరు: పవర్ బ్యాకప్, రెసిడెన్షియల్ సోలార్ స్పేస్‌లో నమ్మకమైన బ్రాండ్ ల్యుమినస్ పవర్ టెక్నాలజీస్ తమ పూర్తి సరికొత్త శ్రేణి ఫ్యూచరిస్టిక్ ఉత్పత్తులను రాబోయే వేసవి కోసం విడుదల చేసింది. స్మార్ట్, సేఫ్, ఇంధన సామర్థ్యం కలిగిన సస్టెయినబల్ ఉత్పత్తులతో వినియోగదారులను ఆనంద పరచాలనే కంపెనీ నిరంతర ప్రయత్నాలలో భాగంగా ఈ ఆవిష్కరణ జరిగింది. హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో ల్యుమినస్ పవర్ టెక్నాలజీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్-మాన్యుఫాక్చరింగ్ అండ్ గ్లోబల్ సప్లయ్ చైన్ రాజీవ్ గంజు మాట్లాడుతూ, ఈ సీజన్‌లో వినియోగదారులను ఆకట్టుకునేందుకు తాజా శ్రేణి పవర్ బ్యాకప్ ఉత్పత్తులు ఐకాన్ శ్రేణి, హై కెపాసిటీ ఇన్వర్టర్ శ్రేణిని వ్యూహాత్మకంగా గృహ, వాణిజ్య విభాగాల అవసరాలను తీర్చేందుకు అందిస్తున్నామని అన్నారు.

తల్లిదండ్రులకు తోడుగా ఉండండి

విశాలాంధ్ర-గుంటూరు: తల్లిదండ్రులు అవసాన దశలోకి చేరిన తర్వాత ప్రతి ఒక్కవిద్యార్థి వారితో కలిసిమెలిసి తోడుగా ఉండాలని హైదరాబాద్‌లోని ఈపీఏఎమ్ సిస్టమ్స్ సీనియర్ రిసోర్స్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఇమ్మాన్యుయల్ గోసుల అన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చదువుతూ ఈ ఏడాది ప్రాంగణ ఎంపికల ద్వారా ప్రముఖ బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు శనివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనివర్సిటీలో ఈ ఏడాది మొత్తం 1429 మంది విద్యార్థులు ప్రాంగణ ఎంపికల ద్వారా 100కి పైగా కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. మొత్తం మీద 85 శాతం మంది విద్యార్థులు వివిధ ప్రముఖ సంస్థల్లో కొలువులు సాధించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

సత్యకుమార్‌పై దాడికి నిరసన

విశాలాంధ్ర-గుంటూరు: బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌పై రాజధానిలో జరిగిన దాడిని ఖండిస్తూ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పిలుపు మేరకు గుంటూరు లాడ్జి సెంటర్‌లో బీజేపీ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున లాడ్జి సెంటరుకు చేరుకొని ఎంపీ నందిగం సురేష్‌కి, వైసీపీ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఫ్ల కార్డులు పట్టుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. ఈ సందర్భంలో పోలీసులకు యువమోర్చా, మహిళా నాయకులకు వాగ్వాదం జరిగింది. శాంతియుతంగా నిరసన తెలియచేస్తున్న బీజేపీ నేతలపై పోలీసులు జులుం ప్రదర్శించారు. రోడ్డుపై నిరసన చేస్తున్న నేతలను ఈడ్చుకుంటు వెళ్ళారు. ఈ క్రమంలో బీజేపీ యువమోర్చా నేత కొక్కెర శ్రీనివాస్ యాదవ్ రోడ్డు మీద బైఠాయించి నిరసన చేపట్టగా తొక్కిసలాటలో గాయమైంది. యువమోర్చా అధ్యక్షుడు మైలా హరికృష్ణను పోలీసులు అరండల్‌పేట పీఎస్‌కు తరలించారు. డాక్టర్ శనక్కాయల అరుణ, శనక్కాయల ఉమాశంకర్, ఈమని మాధవరెడ్డి, చరక కుమార్ గౌడ్, అప్పిశెట్టి రంగా, భాస్కర్, పూర్ణచంద్రరావు, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, ఆవుల రామకోటేశ్వరరావు, ఆవుల నాగేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్, ఫేర్వెల్ డే

విశాలాంధ్ర-గుంటూరు: న్యాయవిద్యలో ప్రవేశించిన విద్యార్థులు చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉత్తమ న్యాయవాదులుగా, న్యాయమూర్తులుగా విరజిల్లాలని ఏఈఎల్‌సీ చైర్మన్ పరదేశి బాబు తెలిపారు. గుంటూరు ఏసీ లా కళాశాలలో ఫ్రెషర్స్ అండ్ ఫేర్వెల్ డే వేడుకలు కళాశాల కరస్పాండెంట్ ఎలీషా ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరదేశి బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. న్యాయశాస్త్రంపై సంపూర్ణ అవగాహన ప్రావీణ్యం సాధించి సమాజంలో న్యాయవ్యవస్థ గౌరవ ప్రతిపత్తి కాపాడాలని పరదేశి బాబు అన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను ఉపాధ్యాయులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, అమృత పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు టిడ్కో నివాసుల కృతజ్ఞతలు

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరి టిడ్కో గృహ సముదాయంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న తేదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వెంటనే స్పందించారు. శనివారం జలధార పేరుతో రెండు మంచినీటి ట్యాంకర్లను పంపించి త్రాగునీటి సరఫరా చేయిస్తున్నారు. వాటర్ ట్యాంకర్లను పంపి, నీటి సరఫరా చేస్తున్న నారా లోకేష్‌కు టిడ్కో గృహ సముదాయంలోని నివాసితులు ధన్యవాదములు తెలిపారు. మంచినీటి పునరుద్ధరణ జరిగే వరకు ట్యాంకర్‌ల ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుందని మంగళగిరి పట్టణ పార్టీ అధ్యక్షులు దామర్ల రాజు తెలియజేశారు.

ఓటమి భయంతోనే ప్రతిపక్షాలపై దాడులు

విశాలాంధ్ర-గుంటూరు: వైసీపీ నేతలకు ఓటమి కళ్ళముందు కదలాడుతుండటంతో దిక్కుతోచని స్థితిలో అసహనం, నిరాశా నిస్పృహలకు గురై ప్రతిపక్ష నేతలపై దాడులకు దిగుతున్నారని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి విమర్శించారు. ప్రతిపక్ష నేతలపై వైసీపీ నేతలు చేసిన దాడులను ఆయన శనివారం తీవ్రంగా ఖండించారు. మరోపక్క తెనాలి పురపాలక సంఘం సమావేశంలో 20వ వార్డు కౌన్సిలర్ దేసు యుగంధర్‌పై వైసీపీ కార్పొరేటర్‌లు మూకుమ్మడిగా దాడి చేయటం దుర్మార్గమని అన్నారు.

కొనసాగుతున్న వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు

విశాలాంధ్ర-తెనాలి: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు(మూడో విడత) కార్యక్రమం తెనాలి పురపాలక సంఘ పరిధిలో ఉన్న 1వ వార్డు నుంచి 4వ వార్డు వరకు, 39, 40వ వార్డులకు స్థానిక ఐతానగర్ పొట్టి శ్రీరాములు హాల్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్‌లో చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఛైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, వైస్ ఛైర్‌పర్సన్ మాలేపాటి హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీవీఐటీ అధ్యాపకునికి డాక్టరేట్ ప్రదానం

విశాలాంధ్ర-గుంటూరు: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన బూమరాజు శ్రీనివాసరాజు విద్యుత్ పంపిణీ వ్యవస్థపై చేసిన పరిశోధనలకు గాను జేఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. వీవీఐటీ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసరాజు 'విద్యుత్ అసమతుల్య, అసమాన పంపిణీ వ్యవస్థపై పునర్నిర్మాణం విశ్లేషణాత్మక అంశం'పై చేసిన పరిశోధనా పత్రాలను జేఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.శివనాగరాజు పర్యవేక్షణలో అందించడం ద్వారా ఈ డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. అనంతరం బూమరాజు శ్రీనివాసరాజును ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ ఛైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లిఖార్జున రెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఏవీ నరేష్ బాబు అభినందించారు.

వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-గురజాల: మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు కార్యక్రమంలో భాగంగా గురజాల పట్టణంలోని చల్లగుండ్ల గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పాల్గొని గురజాల దాచేపల్లి పట్టణ మండలాల డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ ఆనాడు 2014 ఎన్నికల సందర్భంగా రూ.85 వేల కోట్లు రుణమాఫీ చేయలేమని తెలిసి కూడా అలివిగాని అబద్ధపు హామీలతో వచ్చిన అధికారం ఎక్కువ రోజులు ఉండదని, 2019లో టీడీపీకి ప్రజలు గట్టిగానే బుద్ధి చెప్పారు అని, నేడు రాష్ట్రంలోని ప్రతి అక్కచెల్లమ్మకి వైఎస్సార్ ఆసరా కార్యక్రమం ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. అనంతరం 79 మంది మహిళలకు కుట్టుమిషన్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్లు షేక్ బడేజాని, మన్నెం ప్రసాదరావు కన్యాకుమారి, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కలకండ ఆంద్రయ్య, పార్టీ మండల కన్వీనర్ గాంధీ, పట్టణ కన్వీనర్ అన్నారావు, మైనార్టీ నాయకుడు షేక్ నాగుల్ మీరా, పెద్ద సంఖ్యలో డ్వాక్రా మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

BEFORE THE SMALL CAUSES JUDGE
SCCH-14 AT BANGALORE
M.V.C.4773/2021

BETWEEN
Purushotham A.B ....Petitioner
AND
Shaik Baji & others ....Respondent

Notice to Respondent No-1

Shaik Baji, S/o. Shaik Mahabu,No. 2-10-13/2A, 2nd Line, Baramapeta, Narasaraaopet, Guntur-522601. Andra Pradesha.

WHEREAS, take notice that the above named petitioner has filed the above case claiming compensation at **Rs.30,00,000/ (Rupees Thirty Lakhs)** with costs and interest against you for the grievous **injuries sustained by him in road traffic accident which occurred in Hullekere Gate Village, Gandasi Hobli, Arasikere Taluk, Hassan District, on 01-03-2021 at about 10-45 P.M. Involving your Lorry Bearing No. AP-07-TJ-2527,** AS such you are hereby summoned to appear before this Hon'ble court in person or by pleader **on 25/5/2023 at 11.00 AM** to answer the same filing which the above case will be disposed of placing you exparte.

Given under my hand and the seal of the court this the 25/3/2023

By the order of the court
Sd/- Assistant Registrar
Court of Small Causes, Bangalore
Advocate Name & Address:
Krishnamurthy.S.G, Advocates,
Office : No. 145, 1 Floor, 2nd Cross, 2nd Main, Opp ASB Developers, Sunkadakatte, Bangalore-560 091. M:9964096376.

9 నుంచి రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర-తాడేపల్లి: గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, పెను మాకలోని జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ కళ్ళం ఫౌం డేషన్ అధ్వర్యంలో నిర్వహించ నున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన వారు ఎంట్రీ ఫీజు రూ.3333 చెల్లించాల్సి ఉంటుందని, ఈ నెల 7వ తేదీ లోపు తమ టీమ్ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. టోర్నమెంట్‌కు సంబంధించి ఈ నెల 9 నుంచి ఓపెన్ డ్రా ద్వారా మ్యాచ్‌లు ఉంటాయని తెలిపారు. అలాగే తమ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు ప్రతి సంవత్సరం గ్రామీణ, పట్టణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించేందుకు టెన్నిస్, క్రికెట్ లాంటి పోటీలను నిర్వహిస్తున్నామని టోర్నీ నిర్వాహక కమిటీ ప్రతినిధులు కళ్ళం శివగోవింద రెడ్డి, కళ్ళం శ్రీనివాసరెడ్డి, కళ్ళం రాజశేఖర్ రెడ్డి, సభ్యులు కళ్ళం మహేష్ రెడ్డి, కళ్ళం చేతన్ కుమార్ రెడ్డిలు ఓ ప్రకటనలో తెలియజేశారు.

ఆప్కో నిల్వలను 100 శాతం కొంటాం

విశాలాంధ్ర-మంగళగిరి: ఆప్కోలో చేనేత వస్త్ర నిల్వలను 100 శాతం కొనుగోలు చేస్తామని రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. మంగళగిరి పట్టణంలోని రాయల్ కన్వెన్స్‌లో శనివారం రాష్ట్ర చేనేత పారిశ్రామికుల సహకార సంఘం 38వ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం అనంతరం ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి విలేకరులతో మాట్లాడారు. రానున్న కాలంలో ఆప్కోను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ఎండీ ఎంఎం నాయక్, అధికారులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత

విశాలాంధ్ర-గుంటూరు: భారత దేశం శాస్త్రీయంగా అభివృద్ధి చెందే క్రమంలో భావిశాస్త్రవేత్తలను పాఠశాలలే తయారు చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక మల్లారెడ్డి నగర్ లోని డిసెంట్రల్ స్కూల్ 23వ వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలు వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. కాంపిటీషన్ సక్సెస్ కాలేజ్ డైరెక్టర్ ఎస్. రామన్, మాజీ కార్పొరేటర్ మాదా వెంకట ముత్యాలరావు, అకడమిక్ డైరెక్టర్ ఎస్.జ్ఞానశ్రీ, ప్రిన్సిపాల్ ఏ.దుర్గాదేవి పాల్గొన్నారు.

అమరావతికి 'అవగాహన' సంఘీభావం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: రాజధానిగా అమరావతినే కొనసాగించాలని ప్రముఖ విశ్లేషకులు ఆర్‌వీ సింగరయ్య అన్నారు. అభివృద్ధిని వికేంద్రీకరించి వెనుకబడిన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. 1200 రోజులుగా అమరావతి రైతులు, ప్రజలు చేస్తున్న ఉద్యమం పట్ల సానుకూలంగా వ్యవహరించాలని అవగాహన సంస్థ సభ్యుల సమావేశం తెలియజేస్తుందన్నారు. శనివారం స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 1200 రోజులుగా అమరావతి రైతులు, ప్రజలు చేస్తున్న ఉద్యమాన్ని అభినందిస్తూ సంస్థ సభ్యులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్య, వెంకటరత్నం పాల్గొన్నారు. అవగాహన సంస్థ నిర్వహిస్తున్న ఆరోగ్య సభల్లో భాగంగా ఆదివారం పెన్షనర్ అసోసియేషన్ గుంటూరు జిల్లా శాఖ సహకారంతో స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'ఎముకలు, కండరాలు, మోకాళ్ల నొప్పులు-శస్త్ర చికిత్సలు' అనే అంశంపై ఆరోగ్య సభ జరుగుతుందని, ఈ సభకు ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి పాల్గొని అవగాహన కల్పిస్తారన్నారు.

ఉద్యోగుల ఫిర్యాదులను పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఉద్యోగులు తమ సర్వీసుకు సంబంధించి అందించిన ఫిర్యాదులను నిబంధనల మేరకు పరిష్కరించాలని, ఎలాంటి తాత్సారం చూపరాదని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై జరిగిన స్పందనలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజ కుమారి, డీఆర్వో చంద్రశేఖరరావులతో కలసి ఉద్యోగుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఇప్పటి వరకు గతంలో వచ్చిన 75 ఫిర్యాదులలో 41 పరిష్కరించినట్లు, 34 పరిష్కరించాల్సి వుందని తెలియజేసారు. డీఆర్డీఏ, డ్వామా పీడీలు హరి హరనాథ్, యుగంధర్ కుమార్, డిఈఓ శైలజ, డిఎస్ఓ పద్మశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు, డియంఅండ్‌హెచ్ఓ డా.శ్రావణ్ బాబు, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారిణి మనోరంజని, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక ఎన్జీజీవోస్ కాలనీలోని సుమేధ హైస్కూల్ నందు పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించటం కోసం అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సదస్సుకు టుబాకో బోర్డు సెక్రటరీ డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు విచ్చేసి విద్యార్థులకు సూచనలు అందించారు. ప్రతి క్రికెటర్ తన చివరి ఓవర్‌లో ఎలా అయితే తన శక్తినంత కూడగట్టుకొని ఎలా పోరాడుతాడో అలానే ఈ 15 రోజులలో సంవత్సరం మొత్తం చదివినవి బాగా వ్రాయాలని చెప్పారు. అలానే జీవితంలో 10వ తరగతి సర్టిఫికెట్ ఎంతో ముఖ్యమైనదని, దానిలో మార్కులు జీవితాంతం గుర్తుండి పోతాయని తెలిపారు. పరీక్షా సమయంలో విద్యార్థులు పాజిటివ్ థింకింగ్‌తో పాటు ఆత్మవిశ్వాసం చాలా ముఖ్యమన్నారు. హెచ్ఎం రాంబాబు, ఇంచార్జ్ ఎం.విలియమ్స్ పాల్గొని మంచి మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థులకు ఆశీర్వదించారు.

మంచి నీటి పైపులైన్ల పరిశీలన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: గుంటూరు తూర్పు నియోజకవర్గం 4వ డివిజన్‌లోని కుమ్మరి బజార్, తమ్మా రంగారెడ్డి నగర్ 3వ లైన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన మంచినీటి పైప్‌లైన్లను 4వ డివిజన్ కార్పొరేటర్ షేక్.మహమూద్ శనివారం పర్యవేక్షించారు. అలాగే నీటి సమస్యలు ఉన్న డివిజన్‌లోని వినోభా నగర్ 7వ లైను, జాకీర్ హుస్సేన్ నగర్ 1వ లైనును సందర్శించి అక్కడి స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ అధికారులకు మహమూద్ ఆదేశించారు. నగరపాలక సంస్థ ఈఈ కోటేశ్వరరావు, డీఈ కళ్యాణ్‌రావు, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ఓటమి భయంతోనే ఓట్లు తొలగింపు కుట్ర: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్రంలో సాగుతున్న ప్రజా వ్యతిరేక పాలనకు ప్రజలు సమాధి కట్టడం ఖాయమని, ఓటమి భయంతో టీడీపీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపు లక్ష్యంగా వైసీపీ వ్యవహరిస్తోందని పలనాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆరోపించారు. అర్హుల ఓట్లు తొలగింపును ఖండిస్తూ టీడీపీ అధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పీవీ సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన నిరసన ర్యాలీలో ముఖ్యఅతిథిగా జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఓట్ల తొలగింపుకు వ్యతిరేకంగా టిడిపి శ్రేణులు నినదిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక టీ.డి.పి కార్యాలయం నుండి ఆర్టీసీ బస్టాండ్ నుండి శివయ్య స్తూపం నరసరావుపేట ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ తాసిల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుంది. జీ.వి. ఆంజనేయులు తాసిల్దార్ కార్యాలయం వద్ద బైటాయించి నిరసన చేపట్టారు. టీడీపీ నాయకులు, పెమ్మసాని నాగేశ్వరరావు, జరపాల గోవింద నాయక్, షమిమ్ ఖాన్,పాట్లూరి సైదారావు, పత్తి పూర్ణచంద్రరావు, గుంటూరు సాంబశివరావు, ముంద్రు సుబ్బారావు, బచ్చు అంజిరెడ్డి, మీసాల మురళీ కృష్ణ యాదవ్,అమేతపుడి కోటయ్య,గదిపుడి విశ్వనాథం, సోమేపల్లి బ్రహ్మయ్య, గంగినేని బాబు, గద్దె వీర మస్తాన్రావు, పెసల వెంకటనారాయణ, ఆకుమల్ల కాసిం మక్కెనకొండలు, ముత్తినే ఏడుకొండలు, గన్నమునేని వెంకయ్య, తిరుమల శెట్టి బాలయ్య,అయినల కోటేశ్వరరావు, బెల్లంకొండ సైదులు, సొదాగర్ జానీ భాష, వంకాయలపాటి పేరయ్య, గోరంట్ల హనుమంతరావు, రోడ్డ వీరాంజనేయరెడ్డి, గంగినేని చంద్రశేఖర్, బత్తుల గోవిందరాజులు,లాయర్ సిద్దయ్య , వజ్రాల కృష్ణారెడ్డి, మల్లాది ఆవులయ్య, మక్కేన రమేష్, వీరగంధం ఆనంద్ పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం సభ్యులకు ఘన సన్మానం

విశాలాంధ్ర-వినుకొండ: న్యాయ వాదుల సంఘం ఎన్నికలలో సెక్రటరీ, ట్రెజరర్‌గా గెలుపొందిన కొత్తకోట హనుమంతరావు, కాకాని నాగేశ్వరరావు లను జడ్పీ కో ఆప్షన్ సభ్యులు గుండాల స్వెనోమ్ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిత్రులు కొత్తకోట హనుమంతరావు, కాకాని నాగేశ్వరావులు లు శుక్రవారం జరిగినటువంటి ఎన్నికలలో సెక్రటరీగా ట్రెజరర్ గా ఎన్నుకోబడటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇదే విధంగా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యులు గుండాల స్వెనోమ్ , ఇ. టి. బి. సి చర్చ్ అధ్యక్షులు పందుల సాల్మన్, మాజీ ఇ.టి.బి.సి చర్చి అధ్యక్షులు బేతం శ్యాం ప్రసాద్, ఇ .టి. బి. సి సెక్రటరీ కట్టెంపూడి నాగేశ్వరరావు, గొల్లపల్లి రాజు , న్యాయవాదులు ఎం. ఎలీషా బాబు, ఎన్. శేఖర్ బాబు, ఎన్. అశోక్ బాబు, కాళంగి చెన్నయ్య, దుగ్గిపోగు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పౌష్టికాహార పక్షోత్సవాలు

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ మునిసిపాలిటీ పరిధిలో బీ సెక్టార్‌లో గల పాములు కాలనీ అంగనవాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు ఘనంగా జరిగాయి. బీ సెక్టార్ పరిధిలోని 24 కేంద్రాలు వారు పాల్గొన్న సెంటర్ నందు మిల్లెట్స్ తో రకరకాల పిండి వంటలు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ దస్తగిరి షకీలా ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీలత పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ పర్వీన్ అంగన్వాడీ టీచర్లు ఏఎన్ఎంఎస్ మరియు ఆయాలు గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

పోలీసులకు-బీజేపీ నాయకులకు తోపులాట

విశాలాంధ్ర-వినుకొండ: బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌పై కొంతమంది వైసీపీ గుండాలు దాడికి పాల్పడి కర్రలతో, రాళ్లతో దాడి చేసి కారు అద్దాలు ధ్వంసం చేశారు. ఈ సంఘటనకు నిరసనగా రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు సోము వీర్రాజు పిలుపు మేరకు శనివారం నియోజకవర్గ బిజెపి నాయకుల ఆధ్వర్యంలో శనివారం శివయ్య స్తూపం సెంటర్లో నిరసన ప్రదర్శన నిర్వహించి, ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ ఘటనలో పోలీసులకు, బీజేపీ నాయకులకు తోపులాట జరిగింది. యార్లగడ్డ లెనిన్, మేడం రమేష్ తో పాటు జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి ఎండ్లూరివీరయ్య, నూజెండ్ల మండల బిజెపి అధ్యక్షులు జెడ్డా లక్ష్మీనారాయణ, వినుకొండ నియోజకవర్గ బీసీ మోర్చా కన్వీనర్ పాలడుగు రాజు, శావల్యాపురం మండల బిజెపి కార్యదర్శి పూరేటి పేరయ్య, యువమోర్చ నాయకులు కల్వకుంట జాన్ బాబు, పట్టణ బిజెపి నాయకులు సుధా గణేష్, దేవత చిన్న నరసింహారావు, దేసు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

6న సీఎం జగన్ పేట పర్యటన ఖరారు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిలకలూరిపేట పర్యటన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, కార్యక్రమం యావత్తూ సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అధికారులను ఆదేశించారు. ఈ నెల 6వ తేదీ చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో సీఎం జగన్ మోహన్ రెడ్డి పర్యటించనున్నారు. ఇక్కడి నుంచే అధికారికంగా రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా సీఎం పర్యటన ఏర్పాట్లను మంత్రి రజని, జిల్లా కలెక్టర్, ఎస్పీ పార్టీ నాయకులతో కలసి సమీక్షించారు. సభావేదిక ప్రాంగణం తదతర ప్రాంతాలను పరిశీలించారు.

పుచ్చలపల్లి నాటికలు ప్రారంభం

విశాలాంధ్ర-యద్దనపూడి: పుచ్చలపల్లి సుందరయ్య జాతీయ స్థాయి 20వ నాటకోత్సవాలు మార్చి 31వ తేదీ రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ నాటిక ప్రదర్శనలు యద్దనపూడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదికపై జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. సినీ నిర్మాత, దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ, నాటకోత్సవాల నిర్వాహకులు ముత్తవరపు సురేష్ బాబు, ముఖ్యఅతిథులుగా ప్రముఖులు డాక్టర్ పోపూరి రవి మారుతి, ప్రజానాట్యమండలి నాయకులు నూతలపాటి కాళిదాసు, ముత్తవరపు పద్మారావు, వై.రాధాకృష్ణ, జరుగుల శంకర్రావు తదితరులు పాల్గొని పర్యవేక్షించారు. తదుపరి నాటికలను ప్రదర్శించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా నత్తల

విశాలాంధ్ర-పొన్నూరు: పొన్నూరు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా నత్తల వర్ధన్ రావు, ప్రధాన కార్యదర్శిగా షేక్ బాజీ సాహెబ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2023-24 సంవత్సరానికి పొన్నూరు బార్ అసోసియేషన్‌కు జరిగిన ఏకగ్రీవ ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా పిల్లి విజయ్ కుమార్, సహాయ ఉపాధ్యక్షుడిగా వీఎం బాబు, ట్రెజరర్‌గా పొందుగల చైతన్య, స్పోర్ట్స్ సెక్రటరీగా వైవియన్ కృష్ణ, లైబ్రరీ సెక్రెటరీగా పటాన్ ఖాదర్ ఖాన్, లేడీ రిప్రజెన్టేటివ్‌గా వైవీ లక్ష్మిలు ఎన్నికయ్యారు. వీరికి జూనియర్ సివిల్ జడ్జి సత్య కుమారి, అడ్వకేట్‌లు అభినందించారు.

‘ఉక్కు’పై నిర్ణయం మార్చుకోవాల్సిందే

విశాలాంధ్ర-నరసరావుపేట: విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమం 700 రోజులైన సందర్భంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు చేస్తున్నటువంటి ఉద్యమానికి మద్దతుగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కాసా రాంబాబు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం ఉపసహరించుకోకపోతే ఉద్యమం, పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా కాపాడుకుంటామని విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు చేస్తున్న పోరాటానికి ఏఐటీయూసీ పూర్తి అండదండలిస్తుందని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎల్ఐసీ, రైల్వేలు, ఓడరేవులు, హైవేలు, ప్రభుత్వ రంగ సంస్థల మొత్తాన్ని ప్రైవేటుపరం చేస్తుందని, పేద బడుగు బలహీన వర్గాలు ఈ దేశంలో బతికి బట్ట కట్టే పరిస్థితి లేదని అన్నారు. మరోపక్క గ్యాస్ ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచుకుంటూ సామాన్య మధ్యతరగతి ప్రజలపైన భారాన్ని మోపుతా ఉన్నారని అంతేగాకుండా బడా పారిశ్రామికవేత్తలకి ఈ దేశ సంపద మొత్తాన్ని కూడా దోచిపెడుతున్నారని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాన్‌ను ప్రైవేటుపరం కాకుండా ఐదు కోట్ల ఆంధ్ర ప్రజలందరూ ఒక తాటి మీదకు వచ్చి పోరాటాన్ని చేసి బీజేపీ మెడలు వంచాలని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, అంజిరెడ్డి, శ్యామ్ సన్, వెంకయ్య, గౌస్, సురేష, సుబ్బారావు, కొప్పూరు సుబ్బారావు, గురువారెడ్డి, సుబ్బారెడ్డి, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నారాయణపురంలో బంగ్లా సెంటర్‌లో విశాఖ ఉద్యమం 700 రోజుల సందర్భంగా సీపీఐ, ఏఐటీయూసీ కార్యకర్తలు మద్దతు తెలిపారు. మందపాటి రమణారెడ్డి, వేముల వెంకటరెడ్డి, కొమర వెంకటరావు, తెలనాకుల సత్యనారాయణ, బుర్రి కృష్ణారెడ్డి, శ్రీరాములు, షేక్ గాలిషా, గంగారం, ఎద్ల భాస్కర్, రమణమ్మ, సైదా, ఎస్కే అఫ్రీన్, కె.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు

విశాలాంధ్ర-తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డు వద్ద ఉన్న పున్నమ్మ మంచినీటి ధర్మ చెరువుకు సంబంధించి కాలువ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపంమైన చర్యలు తీసుకుంటామని రైతులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. తాడికొండకు చెందిన కూకట్ల మల్లయ్యకు డాక్యుమెంట్ నెంబర్ 1370/21లో 44.5 సెంట్లు డాక్యుమెంట్ నెంబర్ 1371/21లో 9.5 సెంట్లు మొత్తం 54 సెంట్ల భూమి ఉంది. 1921లో గుంటూరుకు చెందిన ఉప్పుటూరి గురునాథం పున్నమ్మ పేరుతో మంచినీటి చెరువును తవ్వించారు. చెరువుకు మంచినీరు వచ్చేందుకు తాడికొండకు చెందిన రైతు కాలారి మల్లయ్య తన 54 సెంట్లను ధర్మంగా ఇచ్చారు. అయితే రాజధాని పుణ్యమా అంటూ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను చెరువుపై పడింది. చెరువును కాజేసేందుకు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కయ్యారు. ధర్మంగా ఇచ్చిన కాలువను సైతం పూడ్చివేశారు. వారసులు కోర్టులో కేసు వేయడంతో వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ మేరకు శనివారం మల్లయ్య వారసులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకర రావు, పార్టీ నాయకులు రామినేని నరసింహారావు పాల్గొన్నారు.

కన్వీనర్లు, గృహసారథులు సమష్టిగా కృషి చేయాలి

విశాలాంధ్ర-నకరికల్లు: గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, మండల జెసిఎస్ ఇన్‌ఛార్జిలు, ప్రజా ప్రతినిధులు అందరూ సమిష్టిగా రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర జలవనరులశాఖామంత్రి అంబటి రాంబాబు అన్నారు. శనివారం మండలంలోని కండ్లకుంటలో సచివాలయ స్థాయిలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కన్వీనర్ల మండల జెసిఎస్ ఇన్‌ఛార్జి మేడం ప్రవీణ్‌రెడ్డి అధ్యక్షత వహించారు. మండల పార్టీ అధ్యక్షులు భవనం రాఘవరెడ్డి, ఉప సర్పంచ్ కండ్లకుంట చందు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ అధికారుల సందర్శన

విశాలాంధ్ర-యడ్లపాడు: మండలం లోని కొండవీటి కోట గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఈమని చంద్రశేఖర్ రెడ్డి శనివారం సందర్శించారు. ఏప్రిల్ నెలలో ఆలయ పునః ప్రతిష్ట కార్యక్రమంల వున్న ట్లు ఆయన వివరించారు. సంబంధిత పనులను పర్యవేక్షించారు. దేవాలయ ధర్మాదాయ అసిస్టెంట్ కమిషనర్ తమ్మారెడ్డి సత్యనారాయణరెడ్డి, కొండవీటి కోట అభివృద్ధి కమిటీ చైర్మన్ కల్లి శివారెడ్డి,ఈఓ శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటకు ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసులు

విశాలాంధ్ర-మాచర్ల: మాచర్ల నుండి పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు ఆర్టిసి ఎక్స్ ప్రెస్ సర్వీస్ లను నడపడం ప్రారంభించినట్టు డిపో మేనేజర్ ఆర్ పిచ్చయ్య తెలిపారు. శనివారం డిఎం పిచ్చయ్య మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి ఎక్స్ ప్రెస్ సర్వీస్ లను ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణీకులతో పాటు జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ ను కోరినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో మాచర్ల నుండి ఉదయం 6 గంటలకు, 11 గంటలకు, సాయంత్రం 4 గంటలకు మూడు ట్రిప్పులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రయాణీకుల రద్దీని బట్టి సర్వీసుల సంఖ్యను పెంచబోనున్నట్టు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-నరసరావుపేట: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. వివిధ ప్రాణాంతక వ్యాధులతో ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య చికిత్సలు పొందిన 37 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు చేయించిన సుమారు 40 లక్షలు విలువైన చెక్కులను బాధ్యత కుటుంబ సభ్యులకు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. పేదరికంతో ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందలేని వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి చెరువులు నింపాలి

విశాలాంధ్ర-శావల్యాపురం: వేసవికాలం సమీపిస్తున్నందున మండలంలోని అన్ని గ్రామాలలో త్రాగునీటి చెరువులను సాగర్ జలాలతో నింపి ప్రజలకు త్రాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల పనితీరు, ప్రగతి నివేదికలను వివరించారు. ఉపాధి హామి ఏపీవో తమ శాఖ పనితీరును వివరిస్తున్నప్పుడు పిచ్చికలపాలెం సర్పంచ్ తిరువీధి శివకుమారిరమణారావు 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలతో పొలాలకు వెళ్లే గ్రావెల్ రోడ్డును ఏర్పాటు చేశామని, ఇందుకు సంబంధించి ప్రభుత్వం మెటీరియల్ వ్యయం కింద రూ83వేలు నిధులు కూడా కేటాయించిందని, పని పూర్తయిన వెంటనే ఇంజనీరింగ్ అధికారులు ఎంబుక్ కూడా పూర్తిచేశారు. అయితే ఈ ఏడాది నుంచి ఉపాధి హామీ పథకం ఎన్ఎస్ఐసీ పోర్టల్ కిందకు మార్చారు. ఆసమయంలో గతంలో చేసిన పనులు అన్ని నూతన అంతర్జాలంలోనికి మార్పు చేయాలి, కాని ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యం వలన గ్రావెల్రోడ్డు నిర్మాణ పని అన్లైన్లో నమోదు చేయలేదు. అందువలన తనకు రావాల్సిన 83 వేలు రాలేదని సభ దృష్టికి తీసుకు వచ్చారు. సమస్యను ద్వామా పిడి దృష్టికి తీసుకెళ్లి సమస్య త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. అనంతరం ఏంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను సకాలంలో పరిష్కరించడానికి అన్ని శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో పంట పొలాలకు వెళ్ళ 2 నుండి 3 రోడ్లను అభివృద్ధి చేయటాని ప్రణాలళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని 46 అంగన్వాడీ కేంద్రాలకు రెండు వేల రూపాయలు చొప్పున మండల పరిషత్ నిదులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పనిచేయని చేతిపంపులను ఒకటి, రెండు రోజుల్లో రిపేర్లు చేపించాలన్నారు. పదవ తరగతి కామన్ పరీక్షల నేపథ్యంలో కరెంటు సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ శాఖకు తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని గ్రామ పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సర్పంచులకు తెలిపారు. ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, తాహశీల్దార్ షేక్ జాన్ సైదులు, వైస్ ఎంపీపీ నంబూరు ప్రభావతి, మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు, సామగ్రి అందజేత

విశాలాంధ్ర-నరసరావుపేట: శ్రీనాథ్ సాహిత్య పరిషత్ సంస్థ సౌజన్యంతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ ఆధ్వర్యంలో శనివారం నరసరావుపేట గ్రంథాలయంకు సుమారు లక్ష రూపాయలు విలువ చేసే ‘బుక్స్, బీరువాలు, వాటర్ డిస్పెన్సర్’ అందచేశారు. గ్రంథాలయంలో జరిగిన ‘విజిట్ టూ లైబ్రరీ’ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గుంటూరు గ్రంథాలయ శాఖ సెక్రటరీ ఝాన్సీలక్ష్మీ, నరసరావుపేట గ్రంథాలయ శాఖ సిబ్బంది ఈఎం స్వామి, స్వర్ణ, చిన్న రామిరెడ్డి, ఖాజావలి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోవెలమూడి మరిన్ని పదవులు అధిరోహించాలి

విశాలాంధ్ర-గుంటూరు: తెలుగుదేశం పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోవెలమూడి రవీంద్ర(నాని) జన్మదిన వేడుకలను గుంటూరు అర్బన్ పార్టీ అధ్యక్షులు డేగల ప్రభాకర్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ప్రభాకర్ మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి నాని ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. నాని రానున్న రోజుల్లో మరెన్నో పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కనపర్తి శ్రీనివాస్‌రావు, ముత్తినేని రాజేష్, నాయుడు ఓంకార్, దామోదర్ శ్రీను నాయక్, తాడిపక సుబ్బారావు, ఎర్ర గోపు నాగేశ్వరరావు, మేళం సైదయ్య, మహంకాళి నరసింహారావు, బొక్కిసం శివరాం, కొండేపు శేఖర్, మహమ్మద్ సీఫ్, సయ్యద్ ముజీబ్, సయ్యద్ ఫిరోజ్, కొల్లి అనిల్, శ్రీకాంత్, ఎద్దుల రమేష్, రాము, శ్రీను, గుంటూర్ వెంకటేష్, షేక్ సిరాజ్, మూర్తి, బత్తిన శంకర్, మాల్యాద్రి, కనకారావు, ప్రసాద్, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు. బాడీ బిల్డింగ్ పోటీలలో సునీల్ సత్తా అద్వితీయమని డేగల ప్రభాకర్ అన్నారు. మార్చి 30న భీమవరంలో జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలలో గుంటూరు నగరానికి చెందిన సునీల్ సత్తాచాటాడు. రానున్న రోజుల్లో జాతీయస్థాయిలో కూడా పాల్గొని దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ 3 పనులకు సహకరించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ఇన్నర్ రింగ్ రోడ్ చాలా కీలకమని, ఎంతో కాలం నుండి పెండింగ్ లో ఉన్న ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్ 3 పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే సుచరిత, నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. శనివారం ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్ 3 వలన ప్రభావితం అయ్యే స్వర్ణ భారతి నగర్‌లో పర్యటించి, అనంతరం స్థానిక కమ్యూనిటి హాల్లో స్థానికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్ విస్తరణలో నష్ట పోతున్న వారికి అర్హత మేరకు జగనన్న కాలనీల్లో ప్రాధాన్యత మేరకు ఇంటి స్థలం పట్టా ఇచ్చి, ఇంటి నిర్మాణాలకు కూడా రుణాలు మంజూరు చేయిస్తామన్నారు. ప్రస్తుతం ఉంటున్న ప్రాంతంలో ఉన్న వారికి చట్ట ప్రకారం భూమి పై హక్కులు లేవని, అటువంటి వారికి జగనన్న కాలనీల్లో పక్కా రిజిస్ట్రేషన్‌తో ఇంటి స్థలం ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఇళ్లు నష్ట పోతున్న వారికి చట్ట ప్రకారం నష్ట పరిహారం ఇస్తామని, రోడ్ పనులకు అందరూ సహకరించాలని కోరారు. ఎంఎల్ఏ సుచరిత మాట్లాడుతూ చట్ట ప్రకారం ఆక్రమణలను తొలగించి పనులు చేపట్టే వీలున్నా, నగరపాలక సంస్థ అధికారులు కూడా రోడ్ ఏర్పాటు వలన నష్ట పోయే ప్రతి ఒక్కరికి న్యాయం చేసిన అనంతరమే పనులు ప్రారంభించాలన్నారు. కార్పొరేటర్లు బి.స్మిత పద్మజ, వై.సాంబిరెడ్డి, పట్టణ ప్రణా ళిక అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వెరిఫికేషన్ సక్రమంగా చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో సీఆర్డీఏ పరిధిలో పంపిణీ చేయ నున్న పేదలందరికీ ఇళ్ళ పథకం లబ్ధిదారుల జాబితాలను పట్టాల పంపిణీ కోసం తప్పులు లేకుండా సచివాల యాల వారీగా వెరిఫికేషన్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో సిఆర్డీఏ పరిధిలో లబ్ధిదారుల వెరిఫికేషన్‌పై నిర్వ హించిన శిక్షణ కార్య క్రమంలో కలెక్టర్ వేణు గోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మలతో కలసి పాల్గొన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గురజాల వారి కోర్టు నందు

E.P. 28/2021 IN O.S 223/2018

పిటీషన్ :

కాండ్రకొండ ఫ్రాన్సిస్ - డి.హెచ్.ఆర్

మరియు

కేతావత్ కుమార్ - జె.డి.ఆర్.

జె.డి.ఆర్ కు చెందిన దిగువ షెడ్యూలు ఆస్తిని వేలం వేయుటకు కోర్టు వారు నిర్ణయించినందున డి. **12-4-2023** వ తేదీ ఉదయం **10:30 గంటలకు** వేలంలో పాల్గొన దలచిన వారు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై కోర్టు వారి షరతులకు లోబడి వేలం నందు పాల్గొనవచ్చును.

షెడ్యూలు : గుంటూరు జిల్లా ప్రస్తుతం పలనాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, మాచర్ల సబ్ రిజిస్టర్ ఆఫీసు, మాచర్ల మండలం, కొప్పునూరు గ్రామం, సర్వేనెంబర్ 365-3Rc నందు ఎక. 1-65 సెంట్ల **భూమికి హద్దులు : తూర్పు :** దొంక, **దక్షిణం :** కేతావత్ రవీంద్ర, **పడమర :** బాణావత్ దాసు, **ఉత్తరం :** కేతావత్ రవి. మెట్ట భూమి.

డి.హెచ్.ఆర్ విలువ ... రు.2,00,000/-

అమీనా విలువ .... రు. 20,00,000/-

వేలం తేదీ. 12-04-2023

(శ్రీ కోర్టు వారి అన్ని షరతులకు లోబడి)

N. శ్యామలాదేవి

డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది

సెల్ : 8096993546

మాచర్ల - 522426

పది పరీక్షలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర-పొన్నూరు: ఈనెల మూడు నుంచి ప్రారంభమవుతున్న పదోతరగతి పరీక్ష కేంద్రాలను శనివారం పొన్నూరు తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్ పరిశీలించారు. పొన్నూరు పట్టణంలో 10వ తరగతి పరీక్షలు జరగనున్న వివేక హైస్కూల్, నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏపీ హైస్కూల్‌లను పరిశీలించడం జరిగింది. అక్కడ ఏర్పాట్ల పరిశీలన చేసి, తగిన సూచనలు జారీ చేశారు. పొన్నూరు మండలం పరిధిలో పరీక్ష నిర్వహించే 7 సెంటర్స్ దగ్గర ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సెక్షన్ 144 ఉత్తర్వులు అమల్లో వుంటాయని సెంటర్ల దగ్గర్లో జిరాక్స్ షాపులు ఏవీ ఓపెన్‌లో వుంచరాదని ఆదేశాలు ఇచ్చారు. అదే విధముగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలౌతున్న తీరును పరిశీలించారు. పిల్లలకు వడ్డించిన సాంబారు సరిపోకపోవడం గమనించి సదరు మధ్యాహ్న భోజన నిర్వాహకులను హెచ్చరించి ఇటువంటి సమస్య పునరావృతం కాకుండా చూడవలసినదిగా స్కూల్ హెచ్ఎంకు ఆదేశాలు ఇచ్చారు.

4న సాధారణ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-దుర్గి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 4వ తేదీ ఉదయం 10.30 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో షేక్ గౌసియా బేగం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ అధ్యక్షులు ఏచూరి సునీత అధ్యక్షతన త్రాగునీరు, నాడు-నేడు, బడి బయట పిల్లలు, గ్రామీణ హౌసింగ్, ఎస్‌డీజీ గోల్స్, ఉపాధి హామీ పథకం, అన్ని ప్రభుత్వ శాఖల పనితీరు, ఇతర అంశాల ఎజెండాపై సమావేశం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తగు సమాచారంతో తప్పక హాజరుకావాలని కోరారు.

మే 13న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర-పొన్నూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ నేలపాడు, అమరావతి వారి ఆదేశాల మేరకు 2023 మే 13న పొన్నూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సత్య కుమారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యక్షముగా హాజరుకావచ్చునని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు వాట్సాప్ నంబర్ 9492662537 లేదా మెయిల్ ఐడి pnrmisc@yahoo.comలో సంప్రదించవలసినదిగా ఆమె కోరారు.

పట్టుదలతో ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలి

విశాలాంధ్ర-నూజెండ్ల: క్రమశిక్షణ, పట్టుదలతో విద్యార్థులు అనుకున్న లక్ష్యాలకు చేరుకోవాలని ఆయుష్ వైద్యాధికారి ఆర్. శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని ములకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులతో ఆయుష్ వైద్యాధికారి మాట్లాడారు. అనంతరం జీఎంఆర్ మిత్ర బృందం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-వినుకొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అన్నారు.. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం 21వ వార్డులో ఎమ్మెల్యే, నాయకులు కార్యకర్తలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి షకీలా. కౌన్సిలర్ శ్రీను ఎంఎస్కే భాష, బ్రహ్మయ్య. రెడ్డి నాగ పద్మ. యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి. ఎంఎల్ రెడ్డి. దండు చెన్నయ్య. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసరావుపేటకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు

విశాలాంధ్ర-దుర్గి: మాచర్ల డీపో నుంచి పల్నాడు జిల్లా నర్సరావుపేటకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఏర్పాటు చేయడమైనది. మాచర్ల నుంచి ప్రతిరోజు ఉదయం 6, 11, 4 గంటలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుస్తాయి. ప్రయాణికుల ఆదరణను బట్టి సర్వీసులను పెంచుతాం. ప్రయాణికులు ఈ సదవకాశమును వినియోగించుకోవాలన్నారు. నూతనంగా పల్నాడు జిల్లా ఏర్పాటు చేయడం వలన ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఏర్పాటు చేయమని మీడియా ప్రతినిధులు, ప్రయాణికుల నుంచి జిల్లా కలెక్టర్‌కు విజ్ఞపులు చేసినందున కలెక్టర్ ఉత్తర్వులు మేరకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు మాచర్ల డీపో మేనేజర్ పిచ్చయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈదురు గాలులకు పడిపోయిన చెట్లు

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో శనివారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా ఉరుములు, మెరుపులతో వర్షం కురవటం వలన రైతులు కళ్ళాల్లో ఆరబోసిన మొక్కజొన్న, మిర్చిపంటలను కాపాడుకోవడానికి నానా తంటాలు పడ్డారు. ఆయా పంటల తడవకుండా వాటిపై పరదాపట్టలు కప్పారు. ఈదురుగాలులకు మండలంలో మునమాక-విప్పర్లపల్లి గ్రామాల మధ్య గల చెట్లు పడిపోయి రోడ్డుకు అడ్డంగా ఉండటం వలన ఆయా గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల వలన మొక్కజొన్న, మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ వర్షాలు ఇంతటితో ఆగిపోతే బాగుంటుందని రైతులు అంటున్నారు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-పెదకూరపాడు: మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ భాను ప్రకాష్ సహకారంతో శనివారం పెదకూరపాడు మండలం హుస్సేన్ నగరంలో గల ఎలిమెంటరీ స్కూలులో విద్యార్థులకు ప్యాడు, జామెంట్రీ బాక్స్, పెన్ను, పెన్సిల్, స్కేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కంకణాల లక్ష్మీనారాయణ, ఫౌండేషన్ సభ్యులు మాగులూరి కృష్ణారావు, కిరణ్ కుంచనపల్లి, ప్రసాద్ కొండవీటి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

విశాలాంధ్ర-దుర్గి: పిడుగుపాటుకు ఆవు మృతి చెందగా, యజమాని స్వల్పంగా గాయపడిన ఘటన రాజానగరం గ్రామ పోలాలో శనివారం మధ్యాహ్నం జరిగింది. ఘటనకు సంబంధించి సేకరించిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన బాపట్ల శ్రీను తన ఆవును శివాచారి నిమ్మతోట వద్ద మేపుకుంటుండగా మధ్యాహ్నం సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది. ఆ సమయంలో శ్రీను ఆవును తోలుకుని ప్రక్కనే ఉన్న డెరాలోకి వెళ్ళి కూర్చున్నాడు. పిడుగు మెరుపుకు ఆవు కుప్పకూలి ప్రక్కనే ఉన్న యజమాని శ్రీను మీద పడి మృతి చెందగా శ్రీను స్వల్పంగా గాయపడ్డాడు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

విశాలాంధ్ర-ఈపూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ అవరణలో ‘వైఎస్సార్ ఆసరా’ మూడో విడత సంబరాల కార్యక్రమానికి బొల్లా బ్రహ్మనాయుడు హాజరై మాట్లాడారు. వైసీపీ పార్టీ మండల కన్వీనర్ కోపేల దేవరాజు, జెడ్పీటీసీ సభ్యుడు తుర్లపాటి చౌడయ్య, శాఖమూరి బుచ్చయ్య, గోనుగుంట్ల వెంకట హనుమయ్య, ఈపూరు సొసైటీ అధ్యక్షులు బొల్లా రాధాకృష్ణ, ఎంపీడీఓ ఉషా కిరణ్, తహశిల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, డ్వాక్రా మహిళలు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజలు మద్దతు తెలపాలి

విశాలాంధ్ర-పర్చూరు: దేశంలో కాంగ్రెస్ పార్టీ ఆశయాల సాధనకు, సత్య సిద్దాంత రాజకీయాలకు ప్రజలు మద్దతు తెలపాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేతలు జేడీ శీలం అన్నారు. రాహుల్ గాంధీకి సంఘీభావంగా శనివారం కాంగ్రెస్ శ్రేణులతో పాదయాత్ర చేశారు. స్థానిక బొమ్మల సెం టర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాపట్ల జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు, పార్టీనాయకులు శ్రీపతి ప్రకాశరావు, తోట శివనాగేశ్వరరావు, పులిపాటి రవి, జానకీరామ్, సంపత్‌కుమార్, దేవరాజ్, పేరం ప్రభాకరరావు, కంభం మార్కు పాల్గొన్నారు.

‘ఉక్కు’... కేంద్రం ఆధీనంలోనే ఉండాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్

విశాలాంధ్ర-కర్లపాలెం: విశాఖ ఉక్కు ప్రభుత్వ ఆధీనంలోనే నడిపించాలని ఏఐటిసి జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ తెలిపారు. రాష్ట్ర పిలుపులో భాగంగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే రిలే నిరాహార దీక్షలు 700 రోజుకు చేరినందున మద్దతుగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కర్లపాలెం లో శనివారం నిరసన దీక్ష జరిగింది. ఈ సందర్భంగా శామ్యూల్ మాట్లాడుతూ ఆనాడు విశాఖకు ఆంధ్రుల హక్కు నినాదంతో ఉమ్మడి రాష్ట్రంలో లక్షలాదిమంది ఉద్యమం ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారం అన్నారు. సుమారు 27 మంది బలిదానంతో ఎమ్మెల్యేలు ఎంపీలు ఇతర ప్రజా ప్రతినిధులు పార్టీలకు అతీతంగా పోరాడి తమ పదవులకు రాజీనామాలు చేసి ప్రభుత్వాన్ని ఒప్పించి సాధించుకున్న కర్మాగారం విశాఖ ఉక్కు అన్నారు. నేటి ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడానికి పూనుకున్న తరుణంలో అక్కడ ఉన్న ఏఐటిసితో పాటు ఇతర కేంద్ర యూనియన్లు స్వతంత్ర సంఘాలు అన్ని జేఏసీగా ఏర్పడి రిలే నిరాహార దీక్షలు గత 700 రోజుల నుంచి చేస్తున్నప్పటికీ ప్రభుత్వంలో ఎటువంటి మార్పు రావడం లేదన్నారు. లాభాల బాటలో నడుస్తున్న విశాఖ ఉక్కును ప్రభుత్వమే సొంతగనులు కేటాయిస్తే మరింత లాభాలు వచ్చే పరిస్థితి ఉందన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే లక్షలాది కార్మికులు వీదినపడతారన్నారు. రాష్ట్ర ప్రజా ప్రతినిధులు పార్టీతో సంబంధం లేకుండా విశాఖ ఉక్కును కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేస్తే అధికారంలో ఉన్న పార్టీ తగిన మూల్యం చెల్లించుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ కరిముల్లా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జేబీ శ్రీధర్, బాపట్ల నియోజకవర్గం సన్నమూరి శ్రీనివాసరావు, రాఘవాచారి , శంషుద్దీన్ స్వామి రెడ్డి అక్కల శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

చేతి పంపు ఏర్పాటు

విశాలాంధ్ర-పిట్టలవానిపాలెం: వేసవికాలం దృష్ట్యా ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకూడదనే మంచి ఉద్దేశంతో చందోలు గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, డాక్టరేట్ అవార్డుల గ్రహీత, మృదుశీలి స్వభావి అందరితో కలివిడిగా ఉండే వ్యక్తి అయిన డాక్టరేట్ షేక్ రహంతుల్లా తన తల్లిదండ్రులైన షేక్ అలీ, అక్తరున్నీసా జ్ఞాపకార్థం చందోలు గ్రామం సమీపంలోని చందోలు - పొన్నూరు వెళ్లే ప్రధాన రహదారి పక్కన మంచినీటి చేతిపంపును ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, పలువురు రహంతుల్లా సేవ గుణం గురించి కొనియాడారు. మంచి నీటి చేతి పంపు ఏర్పాటుకు కృతజ్ఞతలు తెలియజేశారు. రహంతుల్లా మాట్లాడుతూ సమాజానికి సేవ, సహాయం చేయాలనే తపన, గుణం ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. సేవ, సహాయం చేసే దానిలో ఉన్న తృప్తి మారే దేనిలో ఉండదని అయన చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-సంతమాగులూరు: మండలంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేలోని కొమ్మలపాడు గ్రామానికి చెందిన వి మస్తాన్ బాష (25) మృతదేహం అనుమానాస్పద స్థితిలో కొమ్మలపాడు-ఏల్చూరు విట్టల మధ్యలో రోడ్డు పక్కనే పడి ఉంది. కొమ్మలపాడు గ్రామానికి చెందిన వి మస్తాన్ భాష గ్రామ వాలంటీర్ గా గత నాలుగు నెలల క్రితం మానివేసి ఎస్సై కోచింగ్ కోసం హైదరాబాదు వెళ్లి కోచింగ్ లో ప్రిపేర్ అవుతూ పరీక్ష రాసిన నిమిత్తం ఇంటికి వచ్చి అద్దంకి నార్కెట్పల్లి హైవేలోని కొమ్మలపాడు సమీపంలో గల తమ పంట పొలాల్లో మిరప తోటలలో పనులు చేసుకుంటూ ఉన్నాడు. అయితే శుక్రవారం అకాల వర్షాలు రావడంతో మిరప కల్లాలలో పరదాలు కప్పుకొని రాత్రి సమయంలో కూడా మబ్బు పట్టి ఉండటంతో పొలం దగ్గరకు వెళ్ళినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో నేను ఇంటికి వస్తున్నాను వేడి నీళ్లు కాచి పెట్టమని చెప్పాడని ఆ తరువాత ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుందని ఎంతసేపటికి రాలేదని తెల్లవారి తర్వాత శనివారం ఆరున్న ప్రాంతంలో ఒక్కసారిగా హైవే పక్కన మోటారు బైకు రోడ్డు పక్కనే సైడ్ లోకి తీసుకొని పోయి పడి ఉండటం కాళ్లకు చేతులకు గాయాలు లేకపోవడం బాడీ బోర్లా పడి ఉండటం పొట్ట ఛాతి భాగంలో కనబడని దెబ్బలు ఉన్నట్లు పళ్ళు అనుమానాలకు తావిస్తుందని కుటుంబ సభ్యులు తమ రోదనలతో పలు అనుమానాలు ఉన్నాయని రోదిస్తున్నారు జరిగిన సంఘటన స్థలానికి స్థానిక ఎస్సై సమాచారం అందిన వెంటనే హుటా హుటిన అక్కడికి చేరుకొని జరిగిన పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తూ పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆకుకూరలే ఆరోగ్యానికి రక్ష

విశాలాంధ్ర-మార్టూరు: ఆకుకూరలే ఆరోగ్యానికి కొండంత రక్షా అని ఐసిడిఎస్ సూపర్వైజర్ కె. పద్మ అన్నారు. సంతమాగులూరు ప్రాజెక్టు పరిధిలోని ద్రోణాల సెక్టార్ బొల్లాపల్లి గ్రామంలో జంగాల కాలనీ అంగన్వాడీ భవనం నందు శనివారం గర్భిణీలకు బాలింతలకు పిల్ల తల్లులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాలు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. అందరూ ప్రతి రోజు ఆకుకూరలు రక్తహీనతకు చెక్ పెట్టొచ్చని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సింగారావు, సెక్రెటరీ హరిబాబు, కళ్యాణ్ చక్రవర్తి, అంగన్వాడీ టీచర్ లలితమ్మ మహిళా పోలీస్ పద్మావతి, ఎలిశమ్మ, సువార్త పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ

విశాలాంధ్ర-యద్దనపూడి: యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలోని కేవీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు చారిటీ బాక్సు ఆధ్వర్యంలో ప్యాడ్స్, పెన్నులు తదితర పరీక్ష రాసేందుకు ఉపయోగపడే పది రకాల స్టేషనరీ వస్తువులు ప్రధానోపాధ్యాయుడు ఏఎం శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. టీ శ్రీనివాసులు, టీవీకే ప్రసాద్, ఉషారాణి పీ, కే రామ్మోహనరావు, జీ సరస్వతి, యూ రజని, జీ శ్రీనివాసరావు, డీ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి మహిళల చేరిక

విశాలాంధ్ర-చీరాల: చీరాల నియోజకవర్గంలో పెద్ద ఎత్తున మహిళలు పార్టీలోకి రావడం చాలా ఆనందదాయకమని, పార్టీ కోసం పని చేసి జనసేనను అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలని జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ అన్నారు. జనసేన చీరాల మహిళ నాయకురాలు కారంపూడి పద్మిని ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ సమక్షంలో జనసేన పార్టీలో మహిళలు చేరారు. జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్, జిల్లా మహిళా నాయకురాలు గొందిగల శ్రీదేవి, ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శులు గూడూరు శివరామప్రసాద్, కళ్యాణి, ముత్యాలు, రాయని రమేష్, కాపు సంక్షేమ యువసేన బాపట్ల జిల్లా అధ్యక్షులు గోకుల్ కిరణ్ బాబు, జనసేన పార్టీ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-బాపట్ల టౌన్: బాపట్ల టౌన్ కొత్తపేట కు చెందిన గుమ్మడి బుజ్జి గుండె రోగంతో వైద్యశాల యందు చికిత్స పొందుతూ న్న బాధితురాలు కు బాపట్ల మిత్ర బృందం ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం అత్యవసర పరిస్థితుల్లో మేమున్నము అంటూ ఇటీవల సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న మిత్ర బృందం ను పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సంస్థ అధ్యక్షులు బండ్రెడ్డి గోపి, గౌరవ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు, సెక్రటరీ బత్తుల సురేష్, గుమ్మడి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి బీజేపీ నేతల వినతిపత్రం

విశాలాంధ్ర-బాపట్ల: బీజేపీ జాతీయ కార్యదర్శి వై సత్య కుమార్‌పై దాడికి నిరసనగా బీజేపీ బాపట్ల జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షులు బి. కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి బాపట్ల జిల్లా ఎస్పీ ఆఫీస్ వరకు ధర్నా నిర్వహించారు. సత్యకుమార్‌పై దాడిని ఖండించారు. అనైతిక కార్యకలాపాలకు పాల్పడిన వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ మహేష్‌కు వినతి పత్రం సమర్పించారు. బీజేపీ జిల్లా నాయకులు మణికుమార్, జగన్నాథ శాస్త్రి, జీవీఎల్ మోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో బాపట్ల 15వ స్థానం

విశాలాంధ్ర-బాపట్ల టౌన్: పన్ను వసూళ్లలో బాపట్ల మున్సిపాలిటీ రాష్ట్రంలోనే 15వ స్థానాన్ని సాధించడంపై మున్సిపల్ కమిషనర్ ఏ భాను ప్రతాప్ శనివారం తన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందిని, సచివాలయ వలంటీర్లను అభినందించారు. బాపట్ల మున్సిపాలిటీలో 17వేల అసెస్మెంట్ ల కు గాను 8 కోట్ల 80 లక్షల రూపాయల పన్ను వసూళ్లకు గాను ఆరు కోట్ల 20 లక్షల రూపాయలను బాపట్ల మున్సిపాలిటీ మొట్టమొదటిసారిగా వసూలు చేయడం విశేషం. గతంలో ఎప్పుడు కూడా పాత బకాయిలు వసూలు చేయడంలో మున్సిపాలిటీ విఫలమైనప్పటికీ నేడు రాష్ట్రస్థాయిలో 15వ స్థానం దక్కించుకోవడం శుభపరిణామమని మున్సిపల్ కమిషనర్ ఏ భాను ప్రతాప్ పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనపై వామపక్షాల ఉమ్మడి కార్యాచరణ

విశాలాంధ్ర-బాపట్ల: రాష్ట్రానికి బిజెపి ప్రభుత్వం చేస్తున్న విద్రోహ చర్యలు, విభజన హామీలు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ చేసే ఆలోచనను మానుకోవాలని సీపీఐ-సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా సిపిఐ ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఐ-సీపీఎం నాయకులు మాట్లాడారు. రాజధాని నిర్మాణం వెనుక వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇవ్వకపోవడం మరియు జాతీయ ప్రాజెక్టుగా ఉన్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో పోలవరం నిర్వాసితులకు నిధులు ఇవ్వకపోవడం లాంటి కీలక అంశాలు ప్రత్యేకంగా పరిశీలన చేయాలి కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి చేస్తున్న ద్రోహం పై ఒక్క మాట కూడా అనకుండా కేంద్ర విధానాలకు మద్దతు ఇస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండించడం జరిగినది అంతేకాకుండా దేశంలో దళితులపై జరుగుతున్న దాడులను ఖండించకుండా మౌనంగా ఉండడం ఏంటని ప్రశ్నించారు పార్లమెంటులో వ్యవసాయ చట్టాలు విద్యుత్ చట్టాలు తదితర ప్రజా వ్యతిరేక చట్టాలకు మద్దతు ఇవ్వడం ప్రత్యేక హెూదా విభజన హామీలపై నిలదీయడం లేదని విమర్శించారు ప్రాంతీయ పార్టీలైన వైసీపీ తెలుగుదేశం జనసేన బిజెపి యొక్క విధి విధానాలపై ఒక మాట కూడా మాట్లాడకపోవడం ప్రజాస్వామ్యం పై దాడి అమిత్ షా ఆదాని కంపెనీలు లాగా వ్యవహరించడం ఏంటి అని విమర్శించారు ఏప్రిల్ 14వ తేదీ న అంబేద్కర్ జయంతి సందర్భంగా అన్ని ప్రాంతాలలో అంబేద్కర్ విగ్రహాలకు పూలదండలు వేసి పైన పేర్కొనబడిన అంశాలను పరిశీలన చేస్తూ పట్టణ మండల గ్రామ వార్డు స్థాయిలో వీలైనన్ని ఎక్కువ సభలు నిర్వహిస్తూ పాదయాత్రలు చేస్తూ కరపత్రాలు పంచుకుంటూ అవకాశం ఉన్నచోట మహా ధర్నాలు చేస్తామని సిపిఎం సిపిఐ పార్టీలు రెండు కలిసి పనిచేస్తాయని పార్టీ నాయకులు తెలియసినారు. కార్యక్రమంలో సిపిఐ బాపట్ల జిల్లా నాయకులు జల్ది భాగ్య శ్రీధర్, సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగర కొండ ,సిపిఎం పార్టీ నాయకులు బాపట్ల జిల్లా పార్టీ కార్యదర్శి సిహెచ్ గంగయ్య జిల్లా కమిటీ సభ్యులు మణిలాల్, కృష్ణమోహన్, వినోద్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

చీరాలలో యువకుడి దారుణ హత్య

విశాలాంధ్ర-చీరాల: వ్యక్తిని దారుణంగా హతమార్చి కుందేరులో పడవేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే చీరాల మండల పరిధిలోని తోటవారిపాలెం పంచాయితీ వీరయ్యనగర్ కు చెందిన దోనెపూడి సురేంద్రబాబు(30) అలియాస్ సన్నీకు స్టూవర్టుపురంకు చెందిన విజయ్,శ్రీకాంత్, శివ,అబ్బన,కిషోర్లు స్నేహితులు. గతంలో కిషోర్ కు సన్నీకు మధ్య వివాదం జరగడంతో కిషోర్ పై సన్నీ దాడిచేయగా తలకు తీవ్ర గాయమైంది. ఈక్రమంలో నమోదయిన కేసులో సన్నీ జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. ప్రస్తుతం ఈ కేసు ఇంకా కొనసాగుతూనే ఉంది.అయితే ఈకేసు విషయమై రాజీ కుదిర్చేందుకు మాట్లాడాలిరమ్మంటూ ఫోన్ ద్వారా సన్నీను విజయ్,శ్రీకాంత్,శివలు గత నెల 29న బయటకు పిలిచారు. తోటవారిపాలెం కుందేరు ఒడ్డున రాత్రి సమయంలో మద్యం తాగించి పథకం ప్రకారం క్రూరంగా దాడిచేసి హతమార్చారు. వెంటనే మృతదేహం నడుముకు బండరాయి కట్టి,కుందేరులో పడవేసి చేతులు దులుపుకున్నారు. విషయం తెలియని మృతుడు భార్య బెస్తబా భర్త కోసం అన్ని చోట్ల వెదకీ అచూకీ తెలియకపోవడంతో శుక్రవారం ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.తెల్లవారే సరికి కుందేరులో మృతదేహం కాళ్లు నీళ్లపై తేలుతుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో డిఎస్పీ శ్రీకాంత్,రూరల్ సిఐ మల్లికార్జునరావు, ఎస్సై జనార్ధన్లు సిబ్బందితో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు సన్నీగా గుర్తించి హత్య కేసు నమోదు చేసిమృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

అలాగే కేసులోని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ మృతుడి భార్య బెస్తబా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును పూర్తి స్థాయిలో విచారించి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

విశాలాంధ్ర-బాపట్ల: పోలీస్ కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. చీరాల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కే.ఏడుకొండలు గత ఏడాది నవంబర్ 28వ తేదీన అనారోగ్యంతో మరణించారు. ఈ నేపథ్యంలో శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో .ఏడుకొండలు సతీమణి కే.వెంకటరమణ రూ.1 లక్ష అడిషనల్ కార్పస్ ఫండ్ చెక్కును ఎస్పీ అందజేశారు. ఏడుకొండలు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసు శాఖలో అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. అటువంటి వారి కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవవచ్చునని, పోలీసు శాఖ అన్ని విధాలగా అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. ప్రభుత్వం నుండి అందవలసిన ఇతర అన్ని బెనిఫిట్స్ లను త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిరంతరం విధులలో నిమగ్నమై శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడే పోలీస్ అధికారులు మరియు సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల కూడా శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఓ బి.సెక్షన్ సూపర్డెంట్ కే.రాధిక డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

మౌళిక వసతులు లేకుండా ఇల్లు కట్టేదెలా?

విశాలాంధ్ర-భట్టిప్రోలు: లేఅవుట్‌లో మౌళిక వసతులు కల్పించకుండా ఇల్లు కట్టమంటే ఏలా కట్టాలంటూ అధికారులపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ డేను పురస్కరించుకుని మండల కేంద్రమైన భట్టిప్రోలు లేఅవుట్‌లో శనివారం లబ్ధిదారులు, అధికారులతో ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించారు. పలు గృహాలకు అధికారులు శంఖుస్థాపనలు చేశారు. ఉన్నతాధికారులు వస్తున్నారంటే అప్పటికప్పుడు హడావిడిగా రోడ్లు చదును చేస్తారు. నీళ్ళు వదులుతారు తరువాత మళ్ళీ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉంటుందని ఆవేదన చెందారు. నీటి వసతి పూర్తిస్థాయిలో లేని కారణంగా నిర్మాణాలు పగుళ్ళు వస్తున్నాయని, ప్రధాన రహదారి గుంతలు, బురదమయంగా మారడంతో మెటీరియల్‌ను తరలించేందుకు అదనంగా కూలీ చెల్లించాల్సి వస్తుందని లబ్ధిదారులు ఉన్నతాధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. పైపు లైను వ్యవస్థ సక్రమంగా లేదని నిర్మాణాలు ఎలా చేపట్టాలని, మీటింగ్‌లు పెట్టడం వలన ఉపయోగం లేదని గృహ నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ఎదుర్కొంటున్న అవస్థలపై స్పందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. లేఅవుట్లో చివరన ఉన్న స్థలాల్లో గృహ నిర్మాణ పనులు చేపట్టాలంటే నరకం కనిపిస్తుందని వర్షం కురిస్తే స్థలాలకు వెళ్ళే పరిస్థితి ఉండదని పూర్తి స్థాయిలో మౌళిక వసతులు కల్పించినట్లయితే గృహాలు నిర్మించుకుంటామని లబ్ధిదారులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఎడి . జెవిఎస్ఆర్‌కె ప్రసాద్, డ్వామా పిడి బొంతా అర్జునరావు, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం హనుమంతరావు, విద్యుత్ శాఖ ఎడి బాస్కరరావు, గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపిపి డి. లలితకుమారి, జడ్‌పిటిసి సభ్యురాలు టి. ఉదయ బాస్కరి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాపట్ల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

విశాలాంధ్ర-బాపట్ల టౌన్: అభివృద్ధి అంటే పట్టణము లోని రోడ్లు విస్తరించి, మెలికల డ్రైనేజీలు వేయడం కాదని నియోజకవర్గ మొత్తం కూడా రోడ్లు, ప్రజా వసతులను సమకూర్చడమేనని జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి నామన వెంకట శివన్నారాయణ పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి పై విమర్శలను గుప్పించారు. బాపట్ల నియోజకవర్గం లో చేసిన అభివృద్ధి పనులపై శ్వేత పత్రం విడుదల చేయాలని జనసేన పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని గ్రామపంచాయతీలో కూడా రోడ్లు, జలవనరుల సమకూర్పులు, కాలువల మరమ్మత్తులు, రైతులకు, కార్మికులకు, కర్షకులకు మేలైన అభివృద్ధి కార్యక్రమాలను ఒకటైన చేపట్టారని జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి నా మన వెంకట శివన్నారాయణ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల అధ్యక్షులు గోగన ఆది శేషు, ఎమ్మడిశెట్టి మురళీకృష్ణ, ఆరు మల్ల సుజిత్, ఎస్ కే ఆరిఫ్, ఊస ప్రసాద్, గంట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో పశువులకు రక్షణ

విశాలాంధ్ర-రేపల్లె: పశువులను వ్యాధుల నుండి కాపాడుకునేందుకు టీకాలు వేయాలని రాజుకాల్వ సర్పంచ్ జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు తలశిల శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రాజుకాల్వ గ్రామం లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులు ఆరోగ్యం పట్ల పశు పోషకులు శ్రద్ధ వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి పలు పథకాలను అందిస్తుందని తెలిపారు. గ్రామ పంచాయతీ స్థాయిలో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి పాలనలో ప్రభుత్వం విప్లవత్మక మార్పు తీసుకొచ్చిందని అన్నారు. అనంతరం మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతుకు యానిమల్ హెల్త్ కార్డు జారీ చేశామని చెప్పారు. హెల్త్ కార్డ్స్ అందని రైతులు ను గుర్తించి వాక్సినేషన్ చేసే సమయంలో కార్డులు ఇస్తామన్నారు. వైద్య శిబిరంలో 112 గేదెలు, ఆరు దూడలు, తెల్ల పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు వేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గోపాల మిత్ర లు జి. దేవర్ధనరావు, శివకృష్ణ , వైస్ ప్రెసిడెంట్ చీరాల రాజబాబు, సచివాలయం కన్వీనర్ మల్ల మహేష్, మాజీ నీటి సంఘం ప్రెసిడెంట్ తలశిల సీతారామయ్య, పశుపోషకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

ఎమ్మెల్యేగా ఉంటే అద్దంకిని అభివృద్ధి చేస్తా

విశాలాంధ్ర-అద్దంకి : ఎమ్మెల్యేగా ఉంటే అద్దంకి పట్టణాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలబెడతానని శాప్‌నెట్ చైర్మన్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. శనివారం స్థానిక ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో అద్దంకి మున్సిపాలిటీకి సంబంధించి ఆసరా 3వ విడత సంబరాల సభ జరిగింది. మెప్మా సిఎంఎం ఫణికుమారి అధ్యక్షతన వహించారు. 551 డ్వాక్రా గ్రూపులకు మంజూరైన రూ.4.26కోట్ల ఆసరా చెక్కును పొదుపు సంఘాలకు కృష్ణచైతన్య అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎల్. ఎస్తేరమ్మ, కమిషనర్ తేళ్ళ రవికుమార్, మెప్మా పీడీ టీ రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అభినందనీయం

విశాలాంధ్ర-చీరాల: నేతాజీ సేవా సమితి పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులని ప్రోత్సహించడం అభినందనీయమని ఆంధ్రరత్న పురపాలకోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి సాల్మన్ రాజు అన్నారు. శనివారం ఉదయం నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో 2021-22 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల కి ప్రతిభా పారితోషికాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాల్మన్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థులు ఇలాంటి సేవా సంస్థల ప్రోత్సాహంతో మరింతగా చదువు లో రాణిస్తారని అన్నారు. అనంతరం నగదు పురస్కారాలని అందజేశారు. సమితి అధ్యక్షుడు, పాఠశాల పూర్వ విద్యార్థి చుండూరి కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు కె.రాజేంద్రప్రసాద్, వై గాంధీ, చంద్రశేఖర్, పవని భానుచంద్ర మూర్తి, సమితి తరపున ఆలమూరి నాగేశ్వరరావు ,మణి బాబు,రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-రేపల్లె: అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయం అని రూరల్ సిఐ శివ శంకర్ అన్నారు. మండలంలోని గంగడి పాలెం పంచాయతీ జొన్నవారి పాలెంలో మోపిదేవి రాజీవ్ యువసేన ఆధ్వర్యంలో సర్పంచ్ తిరుమల శెట్టి శివాజీ ప్రోత్సాహంతో ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శనివారం ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలలో సుమారు 16 టీమ్ లు పాల్గొంటునట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు వివిధ క్యాటగిరిలో బహుమతులు అందజేయటం జరుగుతుదన్నారు.

ఉన్నత స్థాయి విద్యకు పదోతరగతి కీలకం

విశాలాంధ్ర-చీరాల: ఉన్నత స్థాయి విద్యను అభ్యసించాలంటే పదో తరగతి తొలిమెట్టని, ఇష్టంతో చదివిన చదువును ఖచ్చితంగా పరీక్షలలో రాస్తే మంచి మార్కులతో విజయం సాధించవచ్చని తాడివలస దేవరాజు అన్నారు. సోమవారం నుంచి జరుగనున్న పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష కిట్స్‌ను తాడివలస దేవరాజు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జరగబోయే పరీక్షలలో ఉన్నతమైన మార్కులు సాధిస్తే అటు విద్యను బోధించినగురువులకు,తల్లిదండ్రులకు చదివిన పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు అందించిన వారవుతారని, సంవత్సరం మొత్తం నేర్చుకున్న విద్యను ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలలో రాయాలని అన్నారు. ప్రతి ఒక్కరు పరీక్షలలో ప్రతిభ కనబరచి పరీక్షలలో మంచి మార్కులతో విజయం సాదించాలని ఆకాంక్షించారు.

జ్వరం, దగ్గు నిర్లక్ష్యం చేయొద్దు

విశాలాంధ్ర-చీరాల: చీరాల, పర్చూరు పరిసర ప్రాంత ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ముందడుగు వేస్తుందని డాక్టర్ తాడివలస దేవరాజు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి చీరాల సహకారంతో శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్లో శనివారం ఏర్పాటు చేసిన జ్వరం, నెమ్ము, జలుబు దగ్గు ఉచిత వైద్య శిబిరంలో 70మంది రోగులకు వైద్యసేవలు అందించి అవసరమైన వారికి ఉచిత రక్త పరీక్షలు, మందుల పంపిణీ చేశారు. జనరల్ మేనేజర్ తాడివలస సురేష్ ,రోటరీ క్లబ్ సభ్యులు, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-రేపల్లె: జగనన్న కాలనీలో నివేశన స్థలం పొందిన లబ్ధిదారులు నిర్మాణాలు చేపటాలని రెవెన్యూ డివిజనల్ అధికారి జగన్నాథం పార్థసారథి ఆదేశించారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం పట్టణంలోని 18వ వార్డు, అరుంధతీ నగర్ లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు, హెూసింగ్ అధికారులతొ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయం లోపల జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు పూర్తి చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని అధికారులను హెచ్చరించారు. జగనన్న కాలనీలలో అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయ సారథి సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి కుర్చీలు

విశాలాంధ్ర-భట్టిప్రోలు: మండల కేంద్రమైన భట్టిప్రోలులోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గ్రామానికి చెందిన తూనుగుంట్ల వెంకట సురేష్‌కుమార్ - రోజారాణి దంపతులు శనివారం కుర్చీలను బహుకరించారు. వైద్యశాలకు వచ్చే రోగులు కూర్చునేందుకు సౌకర్యాలు లేక పడుతున్న అవస్థలను గమనించిన సురేష్ కుమార్ దంపతులు స్పందించి వైద్యశాలకు 15 ప్లాస్టిక్ కుర్చీలను అందిస్తున్నట్లు సురేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్ర వైద్యులు శ్రీనివాసరావు మాట్లాడుతూ దాతలు అందించిన సాయం వెలకట్టలేనిదన్నారు. రోగులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా సురేష్‌కుమార్ వారి సౌకర్యార్థం కోసం కుర్చీలను అందజేయడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు లక్ష్మీ పద్మజ, సిహెచ్‌ఓ మాతయ్య, హెచ్‌ఎస్ ప్రసన్నబాబు, ఫార్మసిస్టు కన్యకాదేవి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కార్లు అందజేత

విశాలాంధ్ర-యద్దనపూడి: యద్దనపూడి లో మాజీ ఎమ్మెల్యే, పర్చూరు వైయస్ఆర్ సీపీ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ జగనన్న వైయస్సార్సీపి బడుగు వికాసం పథకం ద్వారా కార్ లబ్ధిదారులకు కారును అందజేసి రిబ్బన్ కటింగ్ చేశారు. బడుగు వికాస్ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. యద్దనపూడి సర్పంచ్ వేల్లేరు రేణుక బాల కోటేశ్వరరావు, కొరకుల ఇసాక్ బాబు బండు ప్రకాష్, భూషణం యద్దనపూడి శామ్యూల్, రాజుఊరి వేణుబాబు, వీరేంద్ర, జె సుబ్బారావు అంకినేడు పాల్గొన్నారు.